నివ్వెరపోతూ, అడిగాను "ఎవరికీ?"

"ఇంకెవరికీ? జూలీకే" కసిరినట్లే అనేసరికి నాకు కరచరణాలాడడం మానేశాయి. నేను పశువుల డాక్టర్నై పదేళ్లయింది కానీ నా సర్వీసులోఒక్క పశువుకి అబార్షన్ చెయ్యలేదు.

"స్కానింగ్‌లో జూలీకి పుట్టబోయేవన్నీ కూడా ఆడపిల్లలే అని తెలిసిందా?"

నాది చచ్చు ప్రశ్నలా తోచిందేమో, వారు నావేపొక చిరాకు చూపు చూశారు.

అయినా నేను ఎలాగో ధైర్యం చేసి "భారతీయులలా భారతీయ జంతువులకి అధిక జనాభా సమస్య ఏర్పడినట్లు లేదింకా. పైగా యన మనుషులకే తప్ప జంతువులకి ఆడసంతానమంటే అనసత్వం కాదు" అంటూంటే ఆయన సహనం పూర్తిగా చచ్చిపోయినట్లు ఒక నిట్టూర్పు విడచి–

"నీకు చెప్పడమే మంచిదేమో. ఈ రహస్యం నీ మనసుల్లోనే వుంచుకో. వారం కిందట నౌకర్లు ఏమరుపాటునుండగా జూలీ వీధిలోకి జారుకుని ఒక వీధికుక్కతో, ఊరకుక్కతో, అలగాజాతి కుక్కతో ముందూ వెనుకా, మంచీ చెడూ ఏమీ చూడకుండా కాలు జారేసింది"

"నేరం కుక్కది కాదు, కార్తెది" అన్నాను జూలీమీద జాలితో.

"మాది పరువు ప్రతిష్టలుకల కుటుంబం. జూలీది గొప్ప వంశం. రేపు జూలీ పిల్లల్నెవరెవరో గొప్పవారు పెంచుకుందుకడుగుతారు. అప్పుడా పిల్లల తండ్రి గురించి ఏం చెప్పగలం? నిజం చెబితే సిగ్గు సిగ్గు. అందుకే ఇప్పుడు జూలీకి అబార్షన్ చేసేస్తే ఈసారి జూలీని మంచి వంశమూ, జాతీ కల కుక్కతో మగ కుక్కతో కలిపి..."

వారి ఉద్దేశమూ, బాధా, తాపత్రయమూ అన్నీ అర్థమైపోయాయి నాకు.

నవ్వాలో ఏడవాలో తెలియక తల వంచేసుకున్నాను.

✡ ✡ ✡ ✡ ✡

# ఇది ఒక శ్వేత వ్యథ

నేను చదువుతున్నది కో–ఎడ్ కాలేజీలో. మా క్లాసులో ఇరవైమందమ్మాయిలూ అరవైమందబ్బాయిలూ ఉన్నారు. నాకు తప్ప మిగిలిన అందరమ్మాయిలకీ కొన్నో ఎక్కువో ప్రేమలేఖలు వొచ్చాయి. వారి వెంట అబ్బాయిలు పడతారు. ప్రేమిస్తున్నామంటూ కవిత్వమూ, సినిమా పాటలూ పాడతారు. కవ్విస్తారు. నవ్విస్తారు. నానా చేష్టలూ చేస్తారు. కానీ – నాకొక్కటంటే ఒక్కటయినా ప్రేమలేఖ రాలేదు. ఒక్క అబ్బాయీ నా వెంట పడలేదు. ఒక్కరయినా నన్ను ఐలవ్‌యూ అనలేదు. కవ్వించలేదు. అందుకే నాకేడు పొస్తూంది.

ఎవరూ నా కళ్ళల్లో కళ్ళు కలపరు. నన్ను తేరిపార చూడరు. ఒక్కసారి– ఒక్కక్షణం నా ముఖమూ కళ్లూ చూసిన తక్షణం కళ్లు దించేసుకుంటారు. తల వొంచేసుకుంటారు. నిశ్శబ్దంగానూ

వేగంగానూ నాముందు నుంచి వెళ్లిపోతారు వినమ్రంగా. రోడ్డు మీదా... తెలియని వారూ కూడా నన్ను రెండోసారి కన్నెత్తి చూడరు. త్రుళ్లిపడినట్లు చూపు తిప్పేసుకుంటారు. నాకేడుపొస్తుంది. అలాగని నన్ను అనాకారిగా అనుకునేరు!

నా పేరు శ్వేత. నేను జగదేక సుందరినట. అతిలోక సుందరినట. నేను సర్వవిధాలా సార్థక నామధేయినట! నన్ను చూస్తే దేవతని చూస్తున్నట్లుంటుందట. నా సౌందర్యం పరమ పవిత్రమయినదట! నన్ను చూడగానే ఎవరికయినా సరే భక్తి భావమూ... పూజ్యభావమూ... పవిత్ర భావమూ తప్ప అన్య ఆలోచనలూ, భావనలూ కలగవట మనసులో. పారిజాత పుష్పాన్ని చూడగానే పూజ మాత్రమే గుర్తుకు వొచ్చినట్లుంటుందట నా దివ్య సౌందర్యాన్ని చూస్తే. అందుకే నాకేడుపొస్తుంది. పసుపు రాసుకోకుండానే నేను పచ్చగా పసిమి వర్ణంతో ఉంటాను. కాలిగోరు మొదలు కేశపాశం వరకూ నిలువునా నిరుపమాన సౌందర్యమే. అందుకు నా బాధ్యతా నేరమూ ఏమున్నాయి? నిజమే. నా పాదాలు లేత తమలపాకులే. నా చేతులు కమలాలే. కాని నేనేం చెయ్యగలను? పట్టుచీరెలు కట్టడం వలనేమో అందరికీ రాజరాజేశ్వరిలా కనపడడమనుకుని- ఒకసారి ఆధునికంగా చుడీదార్ వేసుకుంటే, కాలేజీ అంతా ఎంత గగ్గోలు పెట్టేశారని! శ్వేత సిల్కు స్మిత కారాదని ఒకటే అలజడి. నాకేడుపొచ్చింది. నాకలాటివి నప్పవట. కూడవట. నేను పట్టుచీరలోనే ఉండాలట! నా జీవితం నాది కాదు. నన్ను చూస్తూనే మడి కట్టుకున్న వారి నుంచిలా దూరంగా వైదొలగుతారందరూ. బస్సుల్లో... రష్‌లో కూడా నన్ను ముట్టుకుంటే కాలిపోతామన్నట్లు నన్నెవరూ రాసుకోరు, పూసుకోరు. నాకు సీటిచ్చేస్తారు తగలకుండా. అందుకే నాకేడుపొస్తుంది. ఒకసారి మరీ పిచ్చెత్తిపోయి, చీకటి పడుతూంటే వొంటరిగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లానేదో మిషతో. ఏం లాభం? అక్కడా చుక్కెదురే. కోవెల నుంచి వచ్చిన కనకదుర్గ... అంటూ సాదరంగా... భక్తిగా... పువ్వునిలా చూసి సాగనంపేశారే తప్ప... నన్నేమీ చేయలేదు. నాకు ఏడుపొచ్చింది. పోలీసులకి కూడా నేను దేవతలాగే తప్ప, ఆడదానిలా అగుపించలేదే! ఎంత దురదృష్టం. ఆడవాళ్లకీ, మగవాళ్లకీ... తెలిసిన వారికీ, తెలియనివారికీ... అందరికీ నేనొకటే. శాపవశాన భూమి మీద పడిన దేవతను! ఈ జీవితమింతే. నేనొట్టి వేలుపునే. తెలిసిపోయింది. తేలిపోయింది. నాకేడుపొచ్చింది. ఆడవాళ్లలో నాలాగ... మగవాళ్లలో కూడా ఏ దేముడో నరుడిగా జన్మించి ఉంటే... అతని పురుషత్వం నా స్త్రీత్వాన్ని గుర్తించాలేమో తప్ప - యీ మనుషులూ మగవాళ్లూ నన్ను స్త్రీగా చూడలేరు. కాని... ఆడవాళ్లలో నాలా శాపవశాత్తూ దేవతలు జన్మించవొచ్చుట కానీ... పురుషులలో మగదేముడు పుట్టడట! అంటే... ఈ శ్వేతకి రాముడు దొరకడేనాటికీ. పోలీసులే ఏమీ చేయకుండా వొదిలేసిన ఈ శ్వేతని చెరిచేందుకయినా ఏ రావణాసురుడూ ఉండడు! అంటే... బతికినన్నాళ్లూ - చచ్చినట్లు దేవతగానే బతకాలి! కాని...ఎలా? నా దేహం... ఆంతర్యం... ఆలోచనలు... వాంఛలు... కోర్కెలు... భావనలు... అన్నిటి నిండా అణువణువునా ఆడతనమేనే! దానికి సాఫల్యం? నేను మనిషినే తప్ప మానునీ మాకునీ కానే? రాయినీ రాజేశ్వరినీ కానే? నా మానవీయతా... స్త్రీత్వమూ అడవి కాచిన వెన్నెలేనా జీవితాంతమూ?

ఏనాటికీ పూయని మోడేనా నా బతుకు? ఐతే ఎందుకూ అలాటి బతుకు బతకడం? నా కేడుపొస్తూంది. నాకు చచ్చిపోవాలని ఉంది. నాకీ నిరర్థక... శిలా సదృశ దేవతా జీవితం వొద్దుకాక వొద్దు. నేను రమణిని. రాతి బొమ్మని కాను. అందుకే... నాకు... ఏడుపొస్తూంది.

✡ ✡ ✡ ✡ ✡